క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి లంక గ్రామంలో రూ.40 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులను ఎంపీటీసీ బండారు శివ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పెంకే గోవింద్, పంచాయతీ వార్డు సభ్యులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ


ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

పెదపూడి: స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు వెంకట్రావు ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు లక్షపత్రి పూజ బుధవారం నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనపర్తి: స్థానిక పాతవూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం సెప్టెంబరు 1వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ, కొప్పవరం, అనపర్తి పాతవూరు, మహాలక్ష్మీపేట, అనపర్తి సావారం, ధరణికోట ఏరియా, ఎంపీడీఓ, తహశీల్దార్ కార్యాలయ ప్రాంతాల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సామూహిక లక్ష కుంకుమ పూజలు


అనపర్తి అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక లక్ష కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

అనపర్తి: శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్థానిక కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక లక్ష కుంకుమ పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ చైర్మన్ పడాల రాజు గురుస్వామి, పద్మావతి దంపతులచే వడిశలేరుకు చెందిన వేద పండితులు రాందేవ్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక లక్ష కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

బీబీకా ఆలం ఊరేగింపు


బీబీకా ఆలంను గుర్రంపై ఊరేగిస్తున్న ముస్లింలు

అనపర్తి: మొహర్రం వేడుకల్లో భాగంగా మొహర్రం సంతాప దినాలను ముస్లింలు బుధవారం జరుపుకున్నారు. మండలంలోని పెదపర్తి రేవులో నిర్వహించిన కార్యక్రమంలో బీబీ సకీనాకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీబీకా ఆలం సామూహిక ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముస్లిం మత గురువు సయ్యద్ బిలావ్ నక్వి పాల్గొని మొహర్రం సంతాప విశిష్టతను భక్తులకు వివరించారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

సీతానగరం/మధురపూడి: రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెడుతున్న ప్రైమ్ 2.0 డిజిటల్ ప్రక్రియకు నిరసనగా బుధవారం సీతానగరంలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మడిచర్ల సూర్యనారాయణ మూర్తి, కార్యదర్శి చింతలూరి రమేష్‌ల ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. అలాగే కోరుకొండలో దస్తావేజు లేకర్లు పెన్‌డౌన్ చేపట్టారు. అధ్యక్షుడు ఏడిద సత్య వెంకట రామకృష్ణ, ఉపాధ్యక్షుడు అన్నదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 31వ డివిజన్ మదన్‌సింగ్‌పేటలో హుస్సేన్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.పదివేలు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం మాట్లాడుతూ మిగిలిన బీమా సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. మజ్జి అప్పారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

రయ్‌రయ్‌మంటూ..

- శరవేగంగా కాతేరు - సీతానగరం రోడ్డు పనులు
- పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- త్వరలో ప్రజలకు అందుబాటులోకి..


కాటవరం వద్ద నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

సీతానగరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు - సీతానగరం ఆర్‌అండ్‌బీ నాలుగు లైన్ల రోడ్డు పనులు రయ్‌రయ్‌మంటూ శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రానుంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా ఈ రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. కాతేరు నుంచి సీతానగరం వరకూ 18.2 కిలోమీటర్లు పొడవైన నాలుగు లైన్ల రోడ్డుకు అంచనా వ్యయం రూ.70 కోట్లు కాగా, మరో రూ.35 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపించారు. దీనిపై సీఎం జగన్‌తో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చర్చించారు.

ఎమ్మెల్యే రాజా ప్రత్యేక దృష్టి

రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రత్యేక దృష్టి సారించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాల వద్ద రాత్రి సమయంలో సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. రెండు నెలల్లో మండల ప్రజలకు నాలుగు లైన్ల రోడ్డును అందించాలనే సంకల్పంతో పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే బొబ్బిల్లంక వద్ద సిమెంట్ రోడ్డు పూర్తవ్వగా, కాటవరం, మునికూడలి వద్ద జరుగుతున్నాయి. అలాగే తారురోడ్డు పనులు కూడా వేగవంతమయ్యాయి. నవంబర్ నాటికి ఈ రోడ్డుపై వాహనాలు తిరగనున్నాయి.

సిమెంట్ రోడ్లు

కాతేరు నుంచి సీతానగరం వరకూ గ్రామాల వద్ద డ్రైనేజీ ఏర్పాటు చేసి, సిమెంట్ రోడ్లు వేస్తారు. ఈ విధంగా సిమెంట్ రోడ్డు 10.5 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో భాగంగా బొబ్బిల్లంక వద్ద సిమెంట్ రోడ్డు పూర్తయ్యింది. జాలిమూడి, కాటవరం, మునికూడలి వద్ద రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

కల్వర్టులు, బ్రిడ్జిలు

కాతేరు నుంచి సీతానగరం వరకూ పలు గ్రామాల వద్ద 11 పైపు కల్వర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఆరు పూర్తయ్యాయి. అలాగే శ్లాబ్ కల్వర్టులు నాలుగు ఉండగా, ఆయా ప్రాంతాల్లో ఖాళీగా వదిలేశారు. వీటి పనులు ఇంకా ప్రారంభించలేదు. రాజమహేంద్రవరం రూరల్ వెంకటనగరం, బొబ్బిల్లంక వద్ద బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా, వీటికి గాను సెంట్రల్ రోడ్డు ఫండ్‌కు అంచనా వేసి, ఆయా డిపార్ట్‌మెంట్‌కు ఆర్‌అండ్‌బీ అధికారులు పంపిచారు.

11 ఎకరాల భూసేకరణ

కాతేరు నుంచి సీతానగరం వరకూ రోడ్డు విస్తరణకు సర్వే పూర్తి చేశారు. పలు గ్రామాల వద్ద 11 ఎకరాల వరకూ సేకరించాల్సి ఉంది. దీనికి సంబంధించి అంచనా వేసి, సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు ఆర్‌అండ్‌బీ అధికారులు అందజేశారు. సేకరించిన భూమికి రిజిస్ట్రేషన్ వాల్యూపై రెండురెట్లు ఎక్కువ పరిహారంగా అందించాల్సి ఉంది. ఆపై ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పరిహారం అందిస్తారు.


రఘుదేవపురం, ముగ్గళ్ల మధ్యలో వేస్తున్న తారు రోడ్డు

విద్యుత్ స్తంభాల తొలగింపు

రోడ్డు విస్తరణతో విద్యుత్ స్తంభాలు రోడ్డుకు మధ్యలో ఉన్నాయి. వాటిని తొలగించి, రోడ్డు పక్కన వేయడానికి రూ.7 కోట్ల అంచనా వేశారు. టర్న్‌కీ బేసిక్‌పై ఏపీఈపీడీసీఎల్‌కు చెల్లించే విధంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ శాఖకు రోడ్డు కాంట్రాక్టర్ నగదు చెల్లిస్తాడు. కాంట్రాక్టర్‌కు డిపార్ట్‌మెంట్ నగదు చెల్లిస్తుంది. విద్యుత్‌శాఖ స్తంభాలను తొలగించే కార్యక్రమం ఇప్పటికే చేపట్టారు. సిమెంట్ రోడ్డు వేసిన గ్రామాల వద్ద అడుగున్నర వెడల్పుతో సిమెంట్ దిమ్మలను డివైడర్లుగా ఏర్పాటు చేస్తారు. తారురోడ్డు ఉన్న ప్రాంతంలో డివైడర్లుగా తొమ్మిది అంగుళాల ఎత్తు సిమెంట్‌తో కట్టి మధ్యలో నాలుగు అడుగులలో మట్టి వేసి, మొక్కలను పెంచుతారు.

శరవేగంగా పనులు



కాతేరు - సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల వద్ద సిమెంట్ రోడ్డు పనులు శరవేగంగా చేస్తున్నారు. నవంబర్‌కు రోడ్డు పనులు పూర్తవుతాయి. రూ.70 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభించారు. విద్యుత్, భూసేకరణ వంటి వాటికి మరో రూ.35 కోట్లు అవసరమవుతాయి.

– బీవీ మధుసూదనరావు, డీఈ, ఆర్‌అండ్‌బీ

నవంబర్‌కు పూర్తవుతాయి



గత ప్రభుత్వం ఈ రోడ్డు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తక్షణమే ముఖ్యమంత్రి జగన్ దృష్టిలో ఈ విషయాన్ని ఉంచి, రూ. 70 కోట్ల నిధులు తీసుకువచ్చాం. మరో రూ.35 కోట్లు మంజూరుకై ఇప్పటికే చర్చించాం. కాతేరు నుంచి సీతానగరం వరకూ నాలుగు లైన్ల రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామాల వద్ద సిమెంట్ రోడ్డులు, మిగిలిన ప్రాంతాలలో తారు రోడ్డు ఉంటుంది. నవంబర్‌కు రోడ్డు పనులు పూర్తవుతాయి.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే

గైట్‌లో తెలుగు భాషా దినోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

రాజానగరం: స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు ఔన్నత్యాన్ని, విలువలను విద్యార్థులకు వివరించారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చేసిన కృషిని తెలియజేశారు. ప్రవచన శిఖామణి, ఆంధ్రప్రదేశ్ దేవదాయ సంస్కృతశాఖ ఆగమశాస్త్ర సలహాదారు దొర్భల ప్రభాకరశర్మ సంస్కృత మూలాలను గురించి విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో నృత్యం రూపకంలో వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ కె.వల్లీమాధవి మాట్లాడుతూ తెలుగు, సంస్కృత భాషల మూలాలను, విలువలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ జి.చంద్రయ్య, హెచ్‌ఓడీ ఎ.మాధవి, సంస్కృతం అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సావిత్రి, తెలుగు లెక్చరర్ ఎ.దేవీశైలజ పాల్గొన్నారు.

సారా బట్టీపై ఎస్ఈబీ దాడులు

గోకవరం: కామరాజుపేట గ్రామంలో సారా బట్టీపై బుధవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. కోరుకొండ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది బట్టీపై దాడి నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని గేది సింహాద్రి, గుత్తుల చంద్ర అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామన్నారు.

జగనన్న కాలనీల్లో సకల వసతులు


జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: జగనన్న కాలనీల్లో అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పాత వీరంపాలెం జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన తిమ్మలపూడి లక్ష్మణరావు, రజనీ దంపతులకు ప్రభుత్వం జగనన్న కాలనీలో స్థలాన్ని మంజూరు చేయడంతో అక్కడ ఇంటిని నిర్మించుకున్నారు. తమ ఇంటిని ప్రారంభించాలని ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని కోరడంతో ఆయన వారి ఆకాంక్షను నెరవేర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. పాత వీరంపాలెం జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసులంక గంగాభవాని, ఏసులంక సూరిబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గండి వెంకటేశ్వరరావు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కోటపాడులో సచివాలయం, వెలెనెస్ సెంటర్ నూతన భవనాల ప్రారంభం


కోటపాడులో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ భవనాలతో పాటు రూ.31 లక్షలతో ఏర్పాటుచేసిన మంచినీటి పథకాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఇంటింటికీ సంక్షేమ పథకాలను చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పుట్టిన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం సైతం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, దీనివల్ల సమయం, డబ్బు వృథా అయ్యేవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను తీసుకొచ్చి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆదర్శ పాలనను సాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి గ్రామంలోనూ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకట్రావు, సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, మండల పరిషత్ విప్ సుంకర అప్పారావు, సొసైటీ చైర్మన్ పోతుల బులి వీర్రాజు, పంచాయతీరాజ్ ఏఈ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రక్షా బంధన్


ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి రాఖీ కడుతున్న బెహన్ సుశీల


రక్షాబంధన్ సందర్భంగా సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

అనపర్తి/బిక్కవోలు: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను బుధవారం ఊరూరా వేడుకగా చేసుకున్నారు. ఎక్కడ చూసినా రాఖీ సందడి కనిపించింది. రాఖీలు కొనుగోలు చేసేందుకు వచ్చిన యువతులు, మహిళలతో దుకాణాలు కిటకిటలాడాయి. సరికొత్త డిజైన్ల రాఖీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు నుదుట తిలకం దిద్ది వారి చేతికి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు బెహన్ సుశీల ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సృష్టిలో భగవంతుడు అందించిన అపూర్వ బంధం అన్నా చెల్లెళ్ల బంధమని అన్నారు.

సీఎంకు ఆత్మీయ స్వాగతం



అనపర్తి: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇర్రిపాకలోని హెలిపాడ్ వద్ద సీఎంకు ఆయన ఆత్మీయ స్వాగతం పలికారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్
- మిర్తిపాడులో గడప గడపకూ..


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని మిర్తిపాడులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అందజేసిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతోందన్నారు. మళ్లీ జగన్ ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, ఎస్సీసెల్ నాయకుడు అంబటి రాజు, బూత్ కమిటీ కన్వీనర్ జొన్నలగడ్డ సత్యనారాయణ, ఏకరాజు, పోతిరెడ్డి వినాయకరావు, డొక్కా నాగన్న పాల్గొన్నారు.

విచారణలో విస్తుపోయే నిజాలు

- పంచాయతీ నిధులను సొంత ఖాతాలకు మళ్లించుకున్న దుప్పలపూడి సర్పంచ్ భర్త
- రెండోరోజు కొనసాగిన అధికారుల విచారణ


దుప్పలపూడి పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై రెండో రోజు బుధవారం కొనసాగిన విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సీఎఫ్ఎంఎస్ ఖాతా స్టేట్‌మెంట్లను తనిఖీ చేయగా సర్పంచ్ భర్తతో పాటు పంచాయతీ కార్యదర్శులు తమ సొంత ఖాతాలకు నిధులను మళ్లించుకున్నట్లు ప్రాథమిక విచారణలో నిగ్గుతేల్చారు. ఈ విషయాన్ని స్వయంగా విచారణ పరిశీలనకు దుప్పలపూడి వచ్చిన డీపీఓ జె.సత్యనారాయణ విలేకరులకు తెలియజేశారు. రికార్డులను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి బాధ్యులపై చర్యలకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

చిక్కినవి కొన్నే.. చిక్కనవి ఎన్నో..

విచారణలో అధికారులకు చిక్కినవి కొన్నేనని.. సర్పంచ్ భర్త చేసిన అవకతవకల్లో చిక్కనవి ఎన్నో ఉన్నాయంటూ స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆయన ప్రధానంగా గ్రామ పరిధిలోని పలు పరిశ్రమల నుంచి పెద్ద మొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. అలాగే గ్రామ పరిధిలోని ప్రైవేటు లేఅవుట్లలో సామాజిక స్థలాలు అక్రమంగా విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అవినీతి బాగోతం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దృష్టికి వెళ్లడంతో సర్పంచ్ భర్తను పార్టీ కార్యక్రమాలకు దూరంగా పెట్టారని వైఎస్సార్ సీపీ శ్రేణులు చెబుతున్నారు. దుప్పలపూడి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై జరుగుతున్న విచారణను అధికారులు పూర్తి స్థాయిలో చేపట్టి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నూజిళ్ల శ్రీనివాస్‌కు సత్కారం

సీటీఆర్ఐ: నగరానికి చెందిన ప్రముఖ రచయిత, మేము గోదారోళ్లమండీ పాట ద్వారా గోదారోళ్ల వ్యక్తిత్వాన్ని, అనుబంధాలు, ఆప్యాయతలను విశ్వవ్యాప్తం చేసిన నూజిళ్ల శ్రీనివాస్‌కు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరులో ఘన సన్మానం జరిగింది. ఆయన ఇంగ్లిషు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్నారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో అనేక రచనలు చేస్తున్న నూజిళ్ల శ్రీనివాస్‌ను సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామరాజు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మేడసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖలకు నిరసనగా ర్యాలీ


జి.మామిడాడలో ర్యాలీ చేస్తున్న మండల సాధన సమితి ప్రతినిధులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడపై కొందరు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జి.మామిడాడ మండల సాధన కమిటీ ప్రతినిధులు గ్రామంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తిస్వామి, కోదండ రామాలయం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలున్నాయన్నారు. ఆధ్యాత్మికంగా, విద్యా, వైద్య, వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్న జి.మామిడాడ గ్రామాన్ని మండల కేంద్రంగా విభజించాలని వారు కోరారు. తమ గ్రామంపై ఎవరు ఎలాంటి అనుచిత వ్యాఖలు చేసిన సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సాధన కమిటీ ప్రతినిధులు చింతా దొరబాబు, గ్రామ సర్పంచ్ లంక మున్ని, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, మండ రాజారెడ్డి, కేతా శ్రీను, ద్వారంపూడి అమ్మిరెడ్డి, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి, సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, సబ్బెళ్ల అమ్మిరెడ్డి, ద్వారంపూడి బంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాల నమోదు పూర్తి చేయాలి


కోట సత్యవతి ఓటును తనిఖీ చేస్తున్న జేసీ తేజ్ భరత్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంటింటి సర్వే ద్వారా గుర్తించిన ఓటర్ల చేర్పులు, తొలగింపుల పూర్తి డేటా ఎంట్రీ గురువారానికి పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. నియోజకవర్గంలోని 152 పోలింగ్ కేంద్రం పరిధిలో నూతనంగా నమోదు చేసిన, తొలగించిన ఓటరు వివరాలను బుధవారం ఉదయం స్థానిక ఇన్నీసుపేటలో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మృతుల తొలగింపు, చిరునామా మార్పులు, 80 ప్లస్ ఓటర్ల గుర్తింపు, యువ ఓటర్లు నమోదుపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. తనిఖీలో భాగంగా 82 ఏళ్ల కోట సత్యవతి ఎపిక్-జీఆర్‌హెచ్ 1942325ను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల గుర్తింపుపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపటినటు తెలిపారు.

7న వ్యూహలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్నవెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో సెప్టెంబర్ ఏడో తేదీ ఉదయం 11.58 గంటలకు వ్యూహలక్ష్మి అమ్మవారి నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని పీఠాధిపతి డాక్టర్ శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం దానవాయిపేటలోని ట్రస్టు కార్యాలయంలో సుమేధ వెంకటరాజుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. చిన్నవెంకన్న బాబు మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు 12 గంటల పాటు నిర్విరామంగా వ్యూహలక్ష్మికి, వారాహి అమ్మవారికి హోమం నిర్వహిస్తామన్నారు. తిరుమల క్షేత్రంలోని శ్రీవారి వక్షస్థలంలో కొలువైన శక్తి స్వరూపం వ్యూహలక్ష్మీదేవి అన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మనగుడి, మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్మన్ ధరణికోట దుర్గా వెంకట హేమావతి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వైస్ చైర్మన్ టీవీ అప్పారావు, భాష్యం ప్రిన్సిపల్ ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.